క్లుప్తంగా

ఆటల పోటీలు.. అవగాహన సదస్సులు



బహుమతులు అందిస్తున్న డిపో మేనేజర్

సిరిసిల్లటౌన్: ఆర్టీసీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న లక్ష్యం, ప్రమాద రహిత వారోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను మంగళవారం సిరిసిల్ల డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. కరీంనగర్ రీజనల్ మేనేజర్ ఎన్.సుచరిత పాల్గొనగా వరుస కార్యక్రమాలు చేపట్టారు. డిపోలో పనిచేసే డ్రైవర్ల కుటుంబ సభ్యులకు ప్రమాదరహితంపై అవగాహన కల్పించారు. డిపోలో ప్రమాద రహిత అవార్డులను డ్రైవర్లకు అందించి సన్మానించారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఆటలపోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. డీఎం ప్రకాష్‌రావు, సూపరింటెండెంట్ వేణు, రాజమౌళి, రామకృష్ణ, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఏఏవై కార్డుదారులకు చక్కెర ఇవ్వాలి

సిరిసిల్లటౌన్: జిల్లాలో ఏఏవై కార్డుదారులకు చక్కెర ఇవ్వాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టి మాట్లాడారు. ఏడాదిగా సిరిసిల్ల పట్టణంలో డీలర్లు ఏఏవై కార్డులకు చక్కెర ఇవ్వడం లేదన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారికి ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి నిరుపేదలైన ఏఏవై కార్డుదా రులకు చక్కెర ఇప్పించాలని కోరారు.

హామీలు అమలుచేయాలి

వేములవాడ: ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ నాయకులు మంగళవారం పట్టణంలోని తెలంగాణచౌక్‌లో ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఐ నాయకులు కడారి రాములు డిమాండ్ చేశారు.


4న ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఎల్లారెడ్డిపేట: అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 4న 'నీ గానమే నా ప్రాణం' పేరిట ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 5 గంటలకు గోపూజ, అఖండ దీపారాధన, అయ్యప్పస్వామి పూజ, ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటలకు అఖండ భజన, 6 నుంచి 7 గంటల వరకు లలిత సహస్రనామ పారాయణం, రాత్రి 7 గంటల నుంచి అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి రాష్ట్ర గౌరవ సలహాదారు రాజు గురుస్వామి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీనుగురుస్వాములు మంగళవారం తెలి పారు. కార్యక్రమానికి వ్యవస్థాపక జాతీయ అ ధ్యక్షుడు రాజుదేశ్‌పాండే, జాతీయ ప్రధాన కార్యదర్శి కొండ దేవయ్య, జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని మల్లారం గ్రామంలో సర్వేనంబర్ 213లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జాకు పాల్పడకుండా చూడాలని రూరల్ తహసీల్దార్ సుజాతకు రాజనగర్ కాలనీకి చెందిన ప్రజలు వినతిపత్రం అందించారు. గతంలో 5 గుంటలు ఉన్న ఈ ప్రభుత్వ స్థలంలో లే అవుట్ ద్వారా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, మిగతా గుంటన్నర స్థలాన్ని పక్కనే ఉన్న ఇంటి యజమాని కాజేసేందుకు యత్నిస్తున్నట్లు ఫిర్యాదులో తెలిపారు. ఈ స్థలాన్ని కమ్యూనిటీ భవన ని ర్మాణం కోసం ఇప్పించాలంటూ కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ విచారణ జరిపి న్యా యం చేస్తామని వారికి హామీ ఇచ్చా రు. వి నతి పత్రం అందించిన వారిలో శంకర్, మహేశ్, దే వవ్వ, పద్మ, అనిల్, సందీప్, దేవయ్య ఉన్నారు.

బదిలీలు చేపట్టాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

వీర్నపల్లి: ఏళ్లుగా ఒకే పాఠశాలలో పనిచేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను బదిలీ చేయాలని మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పదేళ్లుగా ఒకే దగ్గర పనిచేస్తూ ఇబ్బంది పడుతున్నామన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తున్నామని, వెంటనే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇంటర్వ్యూలు

ముస్తాబాద్: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వంట మనిషి (కుక్) పోస్టుకు త్రిసభ్య కమిటీ మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఒక పోస్టుకు 29 మంది మహిళలు దరఖాస్తులు చేసుకోగా, వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. త్రిసభ్య కమిటీ సభ్యులు తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో రాజేందర్, ఎంఈవో బన్నాజీలు మహిళల అర్హత వివరాలను తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారి శ్రీలత, తుమ్మ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు నేతన్నల వినతి



కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందజేస్తున్న వస్త్రోత్పత్తిదారులు

సిరిసిల్ల: గత 25 ఏళ్లుగా సిరిసిల్ల మరమగ్గాల (పవర్‌లూమ్స్)కు యాభై శాతం విద్యుత్ సబ్సిడీని ప్రభుత్వం ఇస్తుందని, ఏడాదిగా 'సెస్' అధికారులు 10హెచ్‌పీల వరకే 50 శాతం విద్యుత్ రాయితీ ఉందని, అంతకు మించి ఉంటే ప్రతి యూనిట్‌కు రూ.8 చెల్లించాలని వేధిస్తున్నారని సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'సెస్' అధికారులు గతంలో ఎన్నడూ లేని విధంగా 50 శాతం విద్యుత్ సబ్సిడీని ఇవ్వకుండా కక్షపూరితంగా, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సాంచాలు నడవకపోయినా విద్యుత్ బిల్లులు కొడుతున్నారని, రూ.లక్షల్లో బిల్లులు విధిస్తూ వేధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వస్త్రోత్పత్తి ఆర్డర్లు రాకపోగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. విద్యుత్ సమస్యను పరిష్కరించి పరిశ్రమను ఆదుకోవాలని నేతన్నలు కలెక్టర్‌ను కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ శుక్రవారం 'సెస్' ఎండీ, చైర్మన్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని జౌళిశాఖ ఏడీ సాగర్‌ను కోరారు. 'సెస్' అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జేఏసీ నాయకులు తాటిపాముల దామోదర్, ఆడెపు భాస్కర్, గాజుల నారాయణ, ఆడెపు రవీందర్, మూషం రమేశ్, వెల్దండి శంకర్, మండల బాలరాజు, పంతం రవి, కోడం ఆనంద్‌బాబు, ఆసాములు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సాంస్కృతిక కళాకారులు

సిరిసిల్ల: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మంగళవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పీఆర్‌సీతో కలిపి జీతం మంజూరు చేయడంపై కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని 583 కళాకారుల కుటుంబాల్లో పండగ వాతావరణం ఏర్పడిందన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, పార్టీ నాయకులు గడ్డం నర్సయ్య, కామినేని నీలి రవీందర్, కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడమల శ్రీధర్‌రెడ్డి, కళాకారులు ఆకునూరి దేవయ్య, కమ్మరి తిరుపతి, శ్రీరాముల రామచంద్రం, గడ్డం దేవయ్య, గడ్డం శ్రీనివాస్, పాతూరి రాజు, వంతడ్పుల ఝాన్సీ, గుగ్గిళ్ల పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి



ఆర్టీసీ డ్రైవర్లను సన్మానిస్తున్న సీఐ వీరప్రసాద్, ఎంవీఐ వంశీధర్

వేములవాడఅర్బన్: ఆర్టీసీ బస్సు డ్రైవర్లు బాధ్యతగా పనిచేయాలని, వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, ఎంవీఐ వంశీధర్ పేర్కొన్నారు. వేములవాడ ఆర్టీసీ డిపోలో ప్రమాదరహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడవద్దన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఆర్టీసీ బస్సులను రహదారుల వెంట బస్సులను నిలిపినప్పుడు జాగ్రత్తలు పాటించాలని, లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వేములవాడ డిపోలో ప్రమాదరహిత సర్వీసును నిర్వర్తించిన ముగ్గురు డ్రైవర్లు వెంకటస్వామి, మురళీధర్, రత్నాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించి అవార్డులు అందజేశారు. డిపో మేనేజర్ బోనాల శ్రీనివాస్, గ్యారేజీ ఇన్‌చార్జి రామచంద్రం, ట్రాఫిక్ ఇన్‌చార్జి సత్యనారాయణ, వెంకటయ్య, పీఆర్‌వో శ్రీనివాస్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



నిజామాబాద్‌లో విచారణ జరుపుతున్న ఏఎస్పీ

కోనరావుపేట: కొత్తగా చట్టాలపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఠాణాలోని కేసుల వివరాలను, పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలతో సత్సంబంధాలు కలిగిఉండాలన్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆమె వెంట ఎస్సై అంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

నిజామాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ కేసుపై ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి విచారణ జరిపారు. కోనరావుపేటకు చెందిన పద్మకు, నిజామాబాద్‌కు చెందిన దేవయ్యకు భూమికి సంబంధించిన గొడవలు జరుగుతున్నాయి. తనను కులంపేరుతో దూషించారని దేవయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏఎస్పీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఆమె వెంట ఎస్సై ఆంజనేయులు, సెస్‌వైస్ చైర్మన్ తిరుపతి తదితరులున్నారు.

దీక్ష పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం టీఎమ్మార్పీఎస్ నాయకులు దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టభద్రత కల్పించాలని కోరుతూ ఆగస్టు 6,7 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో జరిగే దీక్షను విజయవంతం చేయాలని కోరారు. కౌన్సిలర్ జోగిని శంకర్, రాజు, ఎలా శ్రీనివాస్, గుడిసె దేవయ్య, తిరుపతి, దేవరాజు, గంగరాజు, ప్రశాంత్, పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.

మా భూమిని మాకు ఇప్పించండి



కోనరావుపేటకు తరలివచ్చిన బావుసాయిపేట దళితులు

కోనరావుపేట: చాలా ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న భూమిని కొందరు వ్యక్తులు కొన్నామని చెప్పి దౌర్జన్యంగా భూమిలోకి చొరబడుతున్నారని ఆరోపిస్తూ బావుసాయిపేట గ్రామానికి చెందిన దళితులు కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. బాధితుల కథనం ప్రకారం.. బావుసాయిపేటకు చెందిన చీటి రామచందర్‌రావుకు దళితులు జీతముండి సేవలు చేసినందుకు గాను గ్రామంలోని సర్వే నం. 18/బి/1/1/1లోని ఎకరంన్నర భూమిని చాలా ఏళ్ల క్రితం వారికి ఇచ్చాడు. అప్పటినుంచి ఆ భూమి 117 కుటుంబాల ఆధీనంలోనే ఉంది. ఇటీవల గ్రామానికి చెందిన తిక్కల పోశయ్య, మరికొందరు సదరు భూమిని రామచందర్‌రావు వారసుడు అశోక్‌రావు వద్ద కొనుగోలు చేశామంటూ చదును చేయిస్తున్నారు. దళితులు అడ్డుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సుమారు 150 మంది దళితులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తుల నుంచి కాపాడి తమకు ఇప్పించాలని మారుపాక శంకర్, బొడ్డు రాములు, నర్సయ్య, నేరెళ్ల బుచ్చయ్య, నర్సయ్య, లచ్చయ్య, మ్యాకల దేవయ్య, వెంకటి, లింగంపెల్లి రాములు, మల్లయ్య, నర్సయ్య తదితరులు కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రుద్రంగి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రుద్రంగిలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఆపరేషన్ అవసరమున్న వారిని కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోడికార్ హీరోజీ, రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందించండి



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అభినవ్

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లికి చెందిన న్యాత అభినవ్ ఈ నెల 17న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అభినవ్ తండ్రి న్యాత దేవరాజు 2009లో మృతిచెందగా తల్లి లావణ్య కూలీ పనులు చేసుకుంటూ తన ముగురు పిల్లల్ని చదివిస్తోంది. చిన్న కుమారుడు అభినవ్‌కు ప్రమాదంలో ముఖం, పక్కటెముకలు విరిగి ఆపరేషన్ కోసం ఇప్పటికే రూ.13 లక్షలు ఖర్చయ్యాయి. మరో రూ.5 లక్షలు వైద్య ఖర్చులకు కావాలని, దాతలు ఆదుకోవాలని లావణ్య కోరుతుంది.

సాయం చేయాల్సిన దాతలు
ఫోన్ పే నం: 94925 56580, 85008 21611

కుంకుమ పూజలు.. ప్రత్యేక అలంకరణలు



ఎల్లారెడ్డిపేట: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



ఎల్లారెడ్డిపేట: కూరగాయల అలంకరణలో అమ్మవారు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శాకంబరీ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమపూజలు చేశారు. అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్నమల్లేశం, కార్యదర్శి అశోక్, కోశాధికారి రాజేశం, సభ్యులు నాగేంద్రం, గంప అంజయ్య పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి మాతకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధరకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఓంకారం, శివలింగాల ఆకృతులను రూపొందించారు.

'సమస్యలు పరిష్కరించాలి'



సిరిసిల్ల టౌన్/ కోనరావుపేట/ ముస్తాబాద్/చందుర్తి/ఇల్లంతకుంట: తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశా కార్యకర్తలు నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి హైదరాబాద్ వెళ్తున్న జీపీ కార్మికులు, ఆశా కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఎన్నికల ముందు పంచాయతీ కార్మికులను ఆదుకుంటామని ప్రకటించిన ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్మికుల డిమాండ్లను పూర్తిగా విస్మరించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీపీ కార్మికులు, ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అందించాలని నిలవాలని డిమాండ్ చేశారు.

కార్గో సేవలను వేగంచేయాలి

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ కార్గో పాయింట్‌ను లాజిస్టిక్స్ మేనేజర్ రామారావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సేవలను మరింత వేగం చేయాన్నారు. అనంతరం పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి'

ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని బీఆర్‌ఎస్ బీసీ విభాగం నాయకుడు దొరగొల్ల బాలయ్యయాదవ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.9వేల కోట్లు మాత్రమే కేటాయించారని, రూ.20వేల కోట్లు కే టాయించి ఎన్నికల హామీని నిలుపుకోవాలన్నారు. బీసీలకు బీసీబంధు అమలు చేయాలని కోరారు. జాల భిక్షపతి, బండి ఎల్లం, సతీష్, రాజు తదితరులున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

సిరిసిల్లటౌన్: మంచి హ్యాండ్ రైటింగ్‌తో విద్యార్థుల భవిష్యత్ బాగుంటుందని మహర్షి విద్యాలయం పాఠశాల కరెస్పాండెంట్ బూర శ్రీనివాస్ అన్నారు. 45 రోజులుగా పాఠశాలలో ఉచిత హ్యాండ్ రైటింగ్ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగియగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించి మాట్లాడారు. కార్యక్రమంలో శిక్షకులు కాంబోజ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బూర శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం రెండో విడత రుణమాఫీ చేయడంతో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ కమిటీ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగాన్ని రైతులతో వీక్షించారు. అనంతరం గొల్లపల్లి బస్టాండ్‌లో పటాకులు కాల్చి సంబరాలు జరిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, నాయకులు రాంరెడ్డి, సుధాకర్‌గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారిని నియమించేదెప్పుడో?

- వేములవాడ పశువైద్యాధికారి బదిలీ
- రెండు మండలాలు, మున్సిపల్‌కు ఇప్పటివరకు ఒక్కరే విధులు
- ఇన్‌చార్జిగా కోనరావుపేట పశువైద్యాధికారికి బాధ్యతలు



వేములవాడ పశువైద్యాధికారి కార్యాలయం

వేములవాడఅర్బన్: వేములవాడ మండల పశువైద్యాధికారి బదిలీకాగా ఇప్పటివరకు ఎవరిని నియమించలేదు. మండల పశువైద్యాధికారిగా పనిచేసిన ప్రశాంత్‌రెడ్డి 14 ఏళ్లుగా విధులు నిర్వహించారు. ఇటీవల సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఇప్పటి వరకు ఇక్కడ పశువైద్యాధికారిగా ఎవరూ రావడం లేదు. ప్రస్తుతం వేములవాడ ఇన్‌చార్జి పశువైద్యాధికారి బాధ్యతలను కోనరావుపేట పశువైద్యాధికారి అంజిరెడ్డికి అప్పగించారు.

రెండు మండలాలు, మున్సిపల్‌కు ఒక్కరే..

వేములవాడ రూరల్, అర్బన్, వేములవాడకు మూడింటికి ఇప్పటివరకు ఒక్కరే పశువైద్యాధికారిగా విధులు నిర్వహించారు. ఇక్కడికి పశువైద్యాధికారిగా రావడానికి అధికారులు భయపడుతున్నట్లు సమాచారం. పని ఒత్తిడితోనే ఇక్కడికి వచ్చేందుకు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. మండలానికి ఒక పశువైద్యాధికారి ఉండాల్సి ఉండగా వేములవాడకు వస్తే రెండు మండలాలు, మున్సిపల్‌కు ఒక్కరే విధులు నిర్వహించేందుకు ఇబ్బందుల దృష్ట్యా అధికారులు ముందుకురావడం లేదన్న అభిప్రాయాలున్నాయి.

రెండు గోశాలలో 500 వరకు కోడెలు

రాజన్న ఆలయానికి కోడె మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. కోడెల సంరక్షణ కోసం రెండు గోశాలలను ఏర్పాటు చేశారు. వేములవాడ కట్టకింద గోశాలలో కోడెలు, ఆవులు ఉంటాయి. తిప్పాపూర్‌లో భక్తులు అందజేసిన కోడెలు ఉంటాయి. సుమారు రెండు గోశాలల్లో 300 నుంచి 500 వరకు ఆవులు, కోడెలు ఉంటాయి. వాటిని పరీక్షించేందుకు పశువైద్యాధికారిని నియమించకపోగా మండల పశువైద్యాధికారే వాటి చూసుకోవాల్సిన పరిస్థితి. దీంతో ఏ పశువైద్యాధికారి ముందుకురావడం లేదన్న ఆరోపణలున్నాయి. జిల్లా ఏర్పాటు అనంతరం కొన్నేళ్ల తర్వాత వేములవాడ డివిజన్ ఏర్పాటైంది. దీంతో వేములవాడకు ఆర్డీవో, డీఎస్పీ, ఏడీఏలను నియమించారు. కానీ పశుసంవర్ధకశాఖలో వేములవాడ సహాయ సంచాలకులు (ఏడీ)ని మాత్రం ఇప్పటివరకు నియమించలేదు. పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులను నియమించడంతో పాటు వేములవాడ రూరల్, వేములవాడ అర్బన్, రాజన్న గోశాలకు మరో పశువైద్యాధికారిని నియమిస్తే ఇబ్బందులు తొలగుతాయని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

• **ఐకమత్యంగా ఉండాలి**

చందుర్తి: గ్రామంలోని ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బండపల్లి అంబేద్కర్ సంఘం ఆవరణలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరైనా కులం పేరుతో దూషిస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ కటకం మల్లేశం, ఏఎస్సై బాపు, ఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రమేశ్‌బాబు, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు లచ్చయ్య, కోశాధికారి బాబు, అంగన్‌వాడీ టీచర్ రేణుక, అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని మరిమడ్లలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామపంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంటరానితనం, వెట్టిచాకిరి వ్యవస్థ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఆర్ఐ రజిని, అంగన్‌వాడీ టీచర్లు, దళితులు పాల్గొన్నారు.

• **అంగన్‌వాడీ ఆయాకు గాయాలు**

బోయినపల్లి: అంగన్‌వాడీ ఆయా గాయపడిన సంఘటన మండలంలోని వెంకట్రావుపల్లిలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా స్వరూప సాయంత్రం అంగన్వాడీ కేంద్రం నుంచి చిన్నారులను దింపి తిరిగి కేంద్రానికి వస్తోంది. కరీంనగర్ నుంచి వేములవాడ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం స్వరూపను ఢీంది. కాలుకు తీవ్ర గాయాలుకాగా స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో కరీంనగర్ తరలించారు.

• **నిధులు కేటాయించాలనడం హాస్యాస్పదం**

వేములవాడ: గతంలో ఎమ్మెల్యేగా గెలిచి తమను పట్టించుకోకుండా పబ్బం గడుపుకున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు జర్మనీలో ఉంటూ నియోజకవర్గానికి నిధులు కేటాయించాలనడం హాస్యాస్పదమని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సంగస్వామి యాదవ్ అన్నారు. వేములవాడ ప్రజలతో కేవలం ఆయనకు ఓట్లబంధమేనని, నేడు ఎక్కడ ఉన్నారంటూ ప్రశ్నించారు.

• **ఆస్పత్రికి తరలింపు**

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ బైపాస్‌రోడ్డుపై ఓ వృద్ధుడు మంగళవారం సొమ్మసిల్లి పడిపోగా గమనించిన కాంగ్రెస్ నాయకులు వెంటనే సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన మల్లయ్య (75) వెంకటాపూర్ నుంచి రగుడు వైపు నడుచుకుంటూ వెళ్తుండగా రోడ్డుపై సొమ్మసిల్లి పడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు ఒగ్గు బాల్‌రాజ్, బుచ్చిలింగు సంతోష్‌గౌడ్‌లు వృద్ధుడిని తమ కారులో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

• **రోగులకు అన్నదానం**

సిరిసిల్లటౌన్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఆస్పత్రిలో రోగులు, సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా సామాజిక సేవలో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు భానుచందర్, అనంతుల శివప్రసాద్, మడుపు నవీన్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, గుగ్గిళ్ల జగన్ గౌడ్, నగునూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

• **బాధిత కుటుంబానికి పరామర్శ**

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్‌లో తాళ్లపల్లి సత్తయ్య ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు తదితరులు పరామర్శించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశాల మేరకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ఇక్కడ బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు గొట్టె రామచందర్, నాయకులు రేగుల మల్లికార్జున్, మార్త సత్తయ్య, శీలం రాజు, నంద్యాడపు వెంకటేశ్, బొల్లారం తిరుపతి, ఆకుల నాగరాజు, వెలివాల రవి, ఎగ్గె మల్లేశం, ముష్కం శ్రీనివాస్ తదితరులున్నారు.

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మల్లిపల్లిలో తుపాకుల పర్శరాం ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయనతో పాటు ఏశ తిరుపతి, పిట్టల వెంకటేశ్, అరిగెల వెంకటేశ్, లచ్చయ్య, నల్ల సతీశ్‌రెడ్డి, ప్రవీణ్, లింగయ్య తదితరులున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

బోయినపల్లి: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయని, అధికారులు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి గురజాల శ్రీధర్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రోడ్లన్నీ బురదతో నిండి ఉండడంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు.

వాహనాల తనిఖీ

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామ శివారులో మంగళవారం డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా చలో హైదరాబాద్‌లో వెళుతున్న పలువురు ఆశాకార్యకర్తలను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.